ఓయూ దూరవిద్య ప్రవేశాల గడువు పెంపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ (2 సం.) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎంట్రన్స్ పరీక్ష దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించినట్లు పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగా రెడ్డి మంగళవారం తెలిపారు. యూజీసీ–డెబ్ నిబంధనల ప్రకారం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 20 వరకు, రూ.500 అపరాధ రుసుముతో 25 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు చెప్పారు. ఎంట్రన్ పరీక్షను ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఐదేళ్ల పీజీ కోర్సుల సీట్ల కేటాయింపు

ఉస్మానియా యూనివర్సిటీ: సీపీగేట్–2025 అడ్మిషన్లలో భాగంగా ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో 212 మంది విద్యార్థులకు మొదటి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయించినట్లు కన్వీనర్ ప్రొ.పాండు రంగారెడ్డి మంగళవారం తెలిపారు. ఐదేళ్ల పీజీ కోర్సులు ఎంఏ ఎకానిమిక్స్, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, ఎంబీఏ కోర్సుల్లో సీటు సాధించిన విద్యార్థులు ఆయా కాలేజీలో 4న రిపోర్టు చేయాలన్నారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు.

రైల్వే సమస్యలు సత్వరమే పరిష్కరించండి


వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని దక్షిణమధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం రైల్వే డివిజనల్ మేనేజర్ గోపాలకృష్ణను కలిసిన యూనియన్ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ డివిజనల్ కార్యదర్శి రవీందర్ మాట్లాడుతూ సికింద్రాబాద్ డివిజన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు సకాలంలో ప్రమోషన్‌లు ఇవ్వడం లేదని చెప్పారు. ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు టూల్ కం రెస్ట్ రూములు అందుబాటులో లేవని అన్నారు. పెట్రోలింగ్ హట్స్ లేవన్నారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజనల్ నాయకులు ఖాజాబాబా, ఎంప్లాయీస్ క్రెడిట్ సొసైటీ ప్రెసిడెంట్ చిలుకు స్వామి, యూనియన్ జోనల్ నాయకులు శ్రీనివాస్, యుగంధర్ యాదవ్, సమయ్య, సంపత్, అంజియాదవ్, బాలముని, ఢిల్లీరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ మండపంలో తల్లిదండ్రులకు పాదపూజ



కంటోన్మెంట్: తల్లిదండ్రులు దైవంతో సమానం అని బీజేపీ సీనియర్ నేత నాగభూషణం రెడ్డి అన్నారు. కంటోన్మెంట్ నాలుగో వార్డు పికెట్ రామ్‌నగర్‌లో ఆయన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ్ సమితి కార్యదర్శి ఆలె భాస్కర్, బీజేపీ మహంకాళీ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, మాజీ అధ్యక్షులు శ్యామ్ సుందర్ గౌడ్ ప్రత్యేక అతిథులుగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక బస్తీలోని పిల్లలతో వారి తల్లిదండ్రులకు పాదపూజ చేయించారు. ఈ సందర్భంగా నాగభూషణం రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులను గౌరవించడం సనాతన ధర్మంలోనే ఉందన్నారు. ఈ సాంప్రదాయాన్ని భవిష్యత్ తరాలు కొనసాగించేలా చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

యువతి అదృశ్యం


మనీషా

రాంగోపాల్‌పేట్: యువతి అదృశ్యమైన ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన నర్సమ్మ, నర్సయ్యల కుమార్తె మనీషా (21) ఈ నెల 1న సాయంత్రం 9 గంటలకు మెడిసిన్ తీసుకొని రావడానికి అని బయటకు వెళ్లింది. ఎంత సేపటికి తిరిగి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు ఆమె ఫోన్‌కు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. తెలిసిన వాళ్లు, బంధువుల దగ్గర విచారించగా, ఎక్కడ ఆచూకీ లభించలేదు. మంగళవారం మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో ఆమె తల్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసికున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఎక్కడైనా ఆమె ఆచూకీ తెలిస్తే మార్కెట్ పోలీస్‌స్టేషన్ నంబర్ 87126 60242 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.


గణనాథుడిని దర్శించుకున్న ఎంపీ ఈటల రాజేందర్


టీమ్- 9 ఆధ్వర్యంలో జరిగిన పూజలో భక్తులు


అన్నదానం చేస్తున్న గజానన అండ్ ఏవీకే ఫ్రెండ్స్ అసోసియేషన్


శాంతినగర్‌లో గణనాథుడిని దర్శించుకున్న ఏసీపీ శశాంక్‌రెడ్డి





మహా గణపతిం.. మనసాస్మరామి

వినాయక చవితి నవరాత్రి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. కంటోన్మెంట్, సనత్‌నగర్, సికింద్రాబాద్ జోన్ పరిధిలో కొలువైన గణనాథుల వద్ద మంగళవారం భక్తులు, ఆయా సంఘాల నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అన్నదాన కార్యక్రమాలను నిర్వాహకులు చేశారు. పలు చోట్ల వినాయకుడి లడ్డూను వేలం పాటలో భక్తులు దక్కించుకున్నారు.
– కంటోన్మెంట్, సనత్‌నగర్, సికింద్రాబాద్ జోన్ బృందం


కల్పతరు అపార్ట్‌మెంట్‌లో..


బేగంపేటలో కార్పొరేటర్ మహేశ్వరి


తార్నాకలోని గణేశ్ మండపంలో జరిగిన పూజలో భక్తులు


ఆవులమందలో పూజలు నిర్వహిస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి


లడ్డూను దక్కించుకున్న శ్రీకాంత్‌రెడ్డి దంపతులు


మోడల్‌కాలనీలో భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు


పార్శిగుట్టలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ


మధురానగర్‌లో అన్నదానం చేస్తున్న సారంగపాణి


మెట్టుగూడలో అడవయ్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాజేందర్‌యాదవ్


సనత్ నగర్ బస్టాప్-2 వద్ద..

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సనత్‌నగర్: సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బేగంపేట డివిజన్‌కు చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరితో కలసి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆడబిడ్డల వివాహానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపారని గుర్తుచేశారు. గడిచిన పదేళ్లలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎనలేని అభివృద్ధి జరిగిందన్నారు. బేగంపేటలో సైతం దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలి

సనత్‌నగర్: దేశాభివృద్ధిలో ఎన్ఎస్ఎస్ ప్రముఖ పాత్ర పోషించేలా నేటి యువత భాగస్వాములు కావాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఆచార్య విద్యాసాగర్ అన్నారు. బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'వికసిత్ భారత్ 2047–యువత పాత్ర' అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ చైర్ పర్సన్, ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉస్మానియా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఆచార్య విద్యాసాగర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల్లో గెలిచిన విజేతలకు ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో నర్సింహులు, సరిత, వెంకటేశ్వర్లు, మధుకర్‌రావు, ప్రసన్న పాల్గొన్నారు.

ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి


ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

అడ్డగుట్ట: గణేశ్ నిమజ్జనోత్సవం, మిలాద్ ఉన్ నబీ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య సూచించారు. మంగళవారం సాయంత్రం అడ్డగుట్టలోని పలు ప్రాంతాల్లో తుకారాంగేట్ పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో పండుగలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఐలు కిరణ్ రెడ్డి, రామకృష్ణ, రమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రాంగోపాల్‌పేట్: మహంకాళి డివిజన్ పరిధిలోని పోలీసులు మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మహంకాళి ఏసీపీ సైదయ్య, రాంగోపాల్‌పేట్, మార్కెట్, మహంకాళి ఇన్‌స్పెక్టర్లు నర్సింగ్‌రావు, రాంచందర్, పరశురాంలతో పాటు ఎస్ఐలు, బందోబస్తుకు వచ్చిన పోలీసులతో కలిసి మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఫ్లాగ్ మార్చ్ కొనసాగించారు. క్లాక్‌టవర్, 31బస్టాప్, మోండా మార్కెట్, జనరల్‌బజార్, ప్యారడైజ్ తదితర ప్రాంతాలో ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు.

సనత్‌నగర్: బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు సున్నిత ప్రాంతాల్లో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

గొల్ల కురుమల సమస్యలు పరిష్కరించండి


మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతి పత్రం ఇస్తున్న గొల్లకురుమ సంఘం నేతలు

లాలాపేట: రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. కొమ్ము అశోక్‌యాదవ్ నేతృత్వంలో మంగళవారం పలువురు గొల్లకురుమలు రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న గొల్ల కురుమల సమస్యలపై మంత్రికి వినతి పత్రాన్ని సమర్పించారు. నూతనంగా ఏర్పాటైన జిల్లాల్లో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. పాడి పశువులు, గొర్రెలు, మేకలు అడవిలో మేపుకొనుటకు హక్కులు కల్పించాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో పోడేటి రవి, భూక్యా తిరుమల లక్ష్మణ్, పోతం సమ్మన్న యాదవ్, వేల్పుల పర్వతాలు, కొమ్ము లింగన్న, బోయిన శ్రీనివాస్‌యాదవ్ తదితరులున్నారు.

జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటుతాం

లాలాపేట: రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఆర్‌పీఐ గెలుపే లక్ష్యంగా హైదరాబాద్‌లోని ఆంధ్రా సెటిలర్స్ ఫోరమ్‌ను బలోపేతం చేస్తామని ఆర్‌పీఐ భీమ్ రావు అంబేడ్కర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. గాలి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆంధ్రా సెటిలర్స్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడిగా గాడి మోహన్ బాబు, ప్రధాన కార్యదర్శిగా షైక్ మోనొద్దీన్‌లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో సుమారు 60 లక్షల మంది ఆంధ్రా సెటిలర్స్ ఉన్నారని వారికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడమే లక్ష్యంగా ఆర్‌పీఐ పని చేస్తుందన్నారు. భవిష్యత్‌లో పార్టీ విస్తరణలో భాగంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో జంబో కమిటీని నియమిస్తామన్నారు.

అవినీతి పేరుతో ఆరోపణలు

సికింద్రాబాద్‌లో కార్పొరేటర్ల నిరసన


చిలకలగూడ కూడలిలో నిరసన తెలుపుతున్న కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు

సికింద్రాబాద్: అవినీతి పేరుతో ఆరోపణలు చేస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిష్ఠను దెబ్బతీయడమే కాకుండా విచారణ కోసం సీబీఐకి అప్పగిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించడంపై సికింద్రాబాద్ ప్రాంత జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు మంగళవారం నిరసన చేశారు. అడ్డగుట్ట, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్ల నుంచి ర్యాలీగా వచ్చిన కార్పొరేటర్లు చిలకలగూడ కూడలిలో బైటాయించి నిరసన ప్రదర్శ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత, కంది శైలజ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంత రైతులకు వరప్రదాయినిగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కుంభకోణం జరిగినట్లు ముఖ్యమంత్రి, మంత్రులు ఆరోపణలు చేయడమే కాకుండా అది నిర్మించిన బీఆర్ఎస్ నేతలను అప్రతిష్ఠపాలు చేయడానికి చూస్తున్నారని ఆరోపించారు. చిలకలగూడ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు చిలకలగూడ స్టేషన్‌కు తరలించారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి


మాణికేశ్వర్‌నగర్‌లో డా. వైఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైఎస్. రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలో క్రిస్టియన్ మైనార్టీ నాయకులు, అభిమానులు ఆయనను స్మరించుకున్నారు. ఆయా డివిజన్లలో కాంగ్రెస్ నాయకులు డా. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో వైస్ పాలన స్వర్ణయుగం లాంటిదని ఈ సందర్భంగా పలువురు నేతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డీసీసీ జనరల్ సెక్రటరీ వరికుప్పల రవి, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు వర్ధ, డానియేల్ ఉన్నారు
– సికింద్రాబాద్/కంటోన్మెంట్/సనత్‌నగర్ జోన్ల బృందం


వైఎస్సార్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్


వైఎస్సార్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న క్రైస్తవ సంఘాల నాయకులు

నేను కలెక్టర్‌ని నన్నే అడుగుతావా.?

ఓయూ ఫిజిక్స్ డిపార్టుమెంట్ వద్ద సెక్యూరిటీ గార్డుపై దాడి



లాలాపేట: ఓ ఐఈఎస్ అధికారి ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని సెక్యూరిటీ గార్డుపై దాడి చేసిన సంఘటన ఓయూ పోలీసుస్టేషన్ పరిధిలో ఇటీవలే చోటు చేసుకుంది. మంగళవారం ఓయూ పోలీసులు ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బోడ దేవిలాల్ ఐఈఎస్‌గా గజ్వేల్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆగస్టు 31న తన అనుచరులు జనార్ధన్, తులసీరాం, ధన్‌సింగ్ బోడాతో కలిసి ఆయన ఇన్నోవా కారులో(టీఎస్09ఈవీ6761) ఓయూ క్యాంపస్‌లోనీ ఫిజిక్స్ డిపార్టుమెంట్ వద్దకు చేరుకున్నారు. ఇన్నోవా కారు నుంచి ఓ వ్యక్తి దిగి ఫిజిక్స్ కళాశాల కార్యాలయం సమీపంలో మూత్ర విసర్జన చేశాడు. అక్కడే విధుల్లో ఉన్న సెక్యూరిటీగార్డు(రిటైర్డు ఆర్మీ) టి. సాయినాథ్ గమనించి అభ్యంతరం తెలుపుతూ వారిని అడ్డుకున్నాడు. దీంతో ఆ వ్యక్తి తాను కలెక్టర్‌నని.. 'నన్నే అడుగుతావా.?'అంటూ ఆగ్రహంతో ఆ సెక్యూరిటీగార్డును దుర్భాషలాడుతూ హంగామా చేశాడు. అతని అనుచరులతో కలిసి సెక్యూరిటీ గార్డు ఫోన్ లాక్కుని చంపేస్తామంటూ అతడిపై దాడిచేశారు. వెంటనే సెక్యూరిటీ గార్డు తన సెక్యూరిటీ ఇన్‌చార్జి నర్సింహులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్నారు. ఆ నలుగురు వారిపై సైతం కర్రతో దాడికి యత్నించారు. ఈ విషయమై సమాచారం అందుకున్న ఓయూ పోలీసులు అక్కడికి చేరుకొని ఆ నలుగురిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేశారు. వారికి నోటీసు ఇచ్చి పంపించినట్లు పోలీసులు పేర్కొన్నారు. బోడా దేవిలాల్ ఓయూ పూర్వ విద్యార్థి అని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై కేబినెట్ నిర్ణయం శాశ్వతం కాదు

ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేణుకుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: స్థానిక సంస్థల ఎన్నికలకు జీవో ద్వారా వెళ్లాని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాన్ని కొన్ని బీసీ సంఘాలు స్వాగతిస్తున్నా 42 రిజర్వేషన్లు శాశ్వతం కాదని ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ డా.అవ్వారు వేణు కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఓయూలో మాట్లాడుతూ... కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రిజర్వేషన్ల విషయంలో బీసీలను నయవంచన చేస్తున్నాయని అన్నారు. గతంలో దేశంలోని 8 రాష్ట్రాలలో ఇలాంటి ప్రయత్నాలు చేసి విఫలమయ్యారని తెలిపారు. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రత్యర్థి పార్టీల నేతలు కోర్టుకు వెళ్లగా వారి ఎన్నిక చెల్లదని కోర్టు కొట్టివేసిందని తెలిపారు. బిహార్ రాష్ట్రంలో జరిపిన కులగణను కోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్ చేర్చి చట్టం చేయడం ద్వారానే బీసీ రిజర్వేషన్లకు పూర్తి భద్రత ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక బాధ్యతగా గుర్తించి 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేవరకు కలసి వచ్చే శక్తులతో ఐక్య బీసీ ఉద్యమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

బౌద్ధనగర్: జామై ఉస్మానియా అంబర్‌నగర్‌లోని అపోలో గ్రామర్ హైస్కూల్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి, అపోలో స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జనరల్ చెకప్‌లతో పాటు గైనకాలజీ, ఆర్థోపెడిక్, చిన్న పిల్లలకు సంబంధించిన వైద్యులు ఇందులో పాల్గొని వివిధ పరీక్షలు చేశారు. అపోలో గ్రామర్ హైస్కూల్ కరస్పాండెంట్ మంచాల రఘు, ప్రిన్సిపాల్ యుగళ, శ్రీసాయి విద్యాలయ హైస్కూల్ కరస్పాండెంట్ వెంకటేష్, డాక్టర్లు స్నేహ, యోగేశ్, ఎంఈ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.